పత్రికా ప్రకటన - 2

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 07.07.2014

ఈ నెల 12 నుండి 27 వరకు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రణాళికల రూపకల్పన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులకు చెప్పారు.

సోమవారం ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో జరిగిన తెలంగాణ నవనిర్మాణ ప్రణాళిక వర్క్‌షాపులో కేసిఆర్ ముగింపు ఉపన్యాసం చేశారు. మన గ్రామం - మన ప్రణాళిక , మన మండలం - మన ప్రణాళిక, మన జిల్లా - మన ప్రణాళిక, మన పట్టణం - మన ప్రణాళిక, మన రాష్ట్రం - మన ప్రణాళికల పేరుతో ఎక్కడికక్కడ ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. మొదటగా ఈ నెల 12 నుండి 17 వరకు గ్రామ ప్రణాళికలు తయారు కావాలని చెప్పారు. ప్రతి జిల్లాకు సగటున వేయి గ్రామాలు ఉన్నందున జిల్లా కలెక్టర్లు వేయి మంది అధికారులను గుర్తించాలని అన్నారు. ఒక్క గ్రామానికి ఒక్కో అధికారిని నియమించి వారి ద్వారా గ్రామ సభలు నిర్వహించి ప్రణాళికలు ఖరారు చేయాలని సూచించారు. 17 నుండి 22 వరకు మండల స్థాయి ప్రణాళిక, 22 నుండి 27 వరకు జిల్లా స్థాయి ప్రణాళికలు రూపొందాలన్నారు. ఈ ప్రణాళిక తయారి కోసం కలెక్టర్లకు సహకరించేందుకు ఓ సీనియర్ ఐఎఎస్ అధికారిని ప్రతి జిల్లాకు కేటాయించనున్నామని చెప్పారు. జిల్లా స్థాయి ప్రణాళిక రూపొందిన తరువాత ఆగష్టు ఒకటి నుండి 10 వరకు రాష్ట్ర స్థాయిలో వర్క్ షాపు నిర్వహించి రాష్ట్ర స్థాయి ప్రణాళికలను రూపొందించనున్నట్లు చెప్పారు. 10 నుండి 20 వరకు తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ రూపకల్పన జరుగుతుంది, ఓ వైపు ఎక్కడికక్కడ ప్రణాళిక రూపొందించుకుంటూనే మరో వైపు ప్రజాప్రతినిధులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కేసిఆర్ చెప్పారు. హైదరాబాద్‌లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి, ఎన్‌ఐఆర్‌డి, అపార్డ్, బ్రహ్మకుమారి సంస్థలలో సర్పంచులు, యంపిపిలు, జడ్పిటిసిలకు శిక్షణనివ్వాలని సూచించారు. 19 నుండి సర్పంచులకు, 23 నుంది మండల అధ్యక్షులకు, 27 నుండి జడ్పిటిసిలకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వచ్చే శనివారం లేదా ఆదివారం నాడు ముఖ్యమంత్రి సమక్షంలోఎంపి, ఎంఎల్ఎ, ఎంఎల్‌సీలకు హైదరాబాద్‌లో ఒకరోజు శిక్షణా కార్యక్రమం

కూడా వుంటుందని చెప్పారు. మొత్తం ఈ ప్రణాళికల రూపకల్పన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సారథ్యం వహిస్తారు. మార్పు కోసం జరిగే ఈ కార్యక్రమానికి కలెక్టర్లు ప్రేరకులుగా మారాలని కేసిఆర్ ఉద్భోధించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా కలెక్టర్ల వ్యవస్థకు పూర్వ వైభవం వస్తుందని చెప్పారు. ఒకటి రెండు రోజులలో ప్రత్యేకాధికారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని వారితో పాటే తహశిల్దారు, ఎంపిడిఒలకు జిల్లా కేంద్రంలో ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని కేసిఆర్ ఆదేశించారు. ఒక వైపు గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రణాళికలు రూపొందించుకుంటునే సమాంతరంగా శాఖల వారి ప్రణాళికలు కూడా సిద్ధం చేయాలని కేసిఆర్ ఆదేశించారు. మంత్రులు ఆయా శాఖల కార్యదర్శులు ఈ పని చేయాలని వెల్లడించారు. అటు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు వచ్చిన ప్రణాళికలు ఇటు ఆయా శాఖల వారిగా తయారయిన ప్రణాళికలు క్రోడికరించుకొని రాష్ట్ర బడ్జెట్ రూపొందించుకోవాలని సిఎం చెప్పారు. ప్రణాళికల తయారీలో మంత్రులు, ఎంఎల్సీలు, ఎంఎల్ఎలను భాగస్వామ్యులను చేయాలని కేసిఆర్ కలెక్టర్లకు సూచించారు. ఊరు ఉమ్మడి కార్యక్రమాలకు ప్రణాళికలో ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. పక్కా ప్రణాళికలతో ముందుకు పోతే బంగారు తెలంగాణ సాధించుకోవడం అసాధ్యం కాదని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులందరూ కొత్తగా ఎన్నికయినందున వారిలో ప్రజలకు మంచి చేయాలనే తపన వుందని, అధికారులు వారిలో స్ఫూర్తిని నింపితే అద్భుత ఫలితాలు వస్తాయని కేసిఆర్ చెప్పారు.

---------------------------------------------------------------